క్లుప్తంగా

పొటాష్‌ను సమయానుకూలంగా వినియోగించాలి

కాజులూరు: వరి పంటపై పొటాష్ ఎరువును రైతులు సమయానుకూలంగా వినియోగించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పంటదమ్ములో మొదటి దఫాగా 25 కేజీల పొటాష్ ఎరువును విధిగా వేయాల్సి ఉందన్నారు. రెండో దఫాగా వరిమొక్క చిరుపొట్ట దశలో మరో 25 కేజీల పొటాష్ ఎరువును వేసినట్లయితే ఓ మోస్తరు తేలికపాటి గాలులకు పంట పడిపోకుండా ఉండి అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ సేద్యంలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను సక్రమంగా నిర్వహించినప్పుడే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించగలుగుతారన్నారు.

ముస్లిం జేఏసీ ఏర్పాటు అప్రజాస్వామికం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో ముస్లిం జేఏసీ పేరుతో ఏర్పాటు అయ్యిన సంఘం జేఏసీ లక్ష్యాన్ని గుర్తించాలని మాజీ షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా మంగళవారం డిమాండ్ చేశారు. ముస్లిం జేఏసీ ఎన్నిక కేవలం పట్టణంలోని మసీదుల కమిటీ సభ్యుల ప్రమేయంతో ఏర్పాటు చేయడం ప్రజాస్వామికం కాదని, క్షేత్ర స్థాయిలోని ముస్లిం సోదరులందరికీ ప్రాధాన్యతనిస్తూ వారి ప్రమేయంతో జేఏసీ ఏర్పాటు కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్‌ను రద్దు చేసినప్పుడు ముస్లిం సోదరులను ఒక్కతాటిపైకి తెచ్చి ఉద్యమించడంలో జేఏసీ వెనుకబడిందన్నారు. వ్యక్తుల లబ్ధి కోసమే జేఏసీ ఏర్పాటు చేయడం ఏమాత్రం ప్రయోజనం లేదని, ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకొని ముస్లిం సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ముస్లిం జేఏసీ కన్వీనర్ ఎన్నిక



నూతన జేఏసీ కన్వీనర్ ఇబ్రహీం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట ముస్లిం జేఏసీ కన్వీనర్‌గా సయ్యద్ ఇబ్రహీం ఎన్నికయ్యారు. పట్టణంలోని మసీదు కమిటీ సభ్యులు, జేఏసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జమియా మస్జిద్ అధ్యక్షుడు ఎండీ అతావుర్ రెహమాన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సేవాదృక్పథంతో కూడిన కార్యక్రమాలను చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తాన్ని జేఏసీని బలోపేతం చేస్తానని ఇబ్రాహీం అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ రబ్బానీ, అల్ ఆమీన్ మస్జిద్ అధ్యక్షుడు ఎండీ రహీం, అక్సా మస్జిద్ అధ్యక్షుడు మౌలాలీ, హమ్జా మస్జిద్ అధ్యక్షుడు అర్షి, జమాఅతె ఇస్లామీ అధ్యక్షుడు ఫారుఖ్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



హసన్‌బాదలోని డార్మెటరీల్లో ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి నాగబాబు సూచించారు. మండలంలోని హసన్‌బాదలో సిబ్బందితో కలసి ఆయన డెంగీ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సమీకృత బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. డార్మెటరీలలో ఏసీఎం 5 శాతం మందును దగ్గరుండి పిచికారీ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎం వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్లు ఏసుబాబు, కృష్ణ, కొండయ్య, ఆశాలు పాల్గొన్నారు.

జూదరులపై పోలీసుల దాడి

సఖినేటిపల్లి: గ్రామంలోని ఓ రైతు కొబ్బరి తోటలో పేకాడుతున్న వారిపై స్థానిక పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడి చేశారు. దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి నగదు రూ.4,500 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపారు. కాగా వారికి స్టేషన్ కండిషన్ బెయిల్ మంజూరు చేసి, విడుదల చేసినట్టు ఎస్సై అన్నారు.

ర్యాంపు మార్గాల మూసివేత



కపిలేశ్వరపురం ర్యాంపు మార్గాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం: స్థానిక శ్రీరామపురంలో డీ కాస్ట్ పట్టా ల్యాండ్‌కు సంబంధించిన ఇసుక ర్యాంపును మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ర్యాంపులో అక్రమాలు జరగకుండా ఉండేందుకు ర్యాంపు మార్గానికి గాడి తవ్వించామన్నారు. కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపులను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి ఇసుక తవ్వకాలు, తరలింపునకు సంబంధించిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెరటికోడి.. లాభాల సడి

- జాతుల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి
- గ్రామీణులకు మెండుగా ఉపాధి
- తక్కువ పెట్టుబడితో ఆదాయం





పశువైద్యాధికారిణి డాక్టర్ ఎం.బిందు

రాయవరం: గ్రామీణప్రాంతాల్లో నాటుకోళ్ల పెంపకం ఒకప్పుడు రైతుల జీవనశైలిలో భాగంగా వుండేది. కానీ మారిన పరిస్థితుల్లో కోళ్ల పెంపకం పౌల్ట్రీ ఫారాలకే పరిమితమయ్యింది. నాటు కోళ్లనుంచి గుడ్లు, మాంసం దిగుబడి తక్కువగా వుండటంవల్ల, వీటి పెంపకం రానురాను కనుమరుగై బాయిలర్ కోళ్లు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయంలో పాడి పరిశ్రమ తర్వాత స్థానం పెరటికోళ్ల పెంపకానిదే. గ్రామీణ ప్రాంతాల్లో పెరటికోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందంటున్నారు పశువైద్యాధికారులు. మండల పశువైద్యాధికారిణి డాక్టర్ ఎం.బిందు పెరటికోళ్ల పెంపకంలో పాటించాల్సిన కొన్ని మెళకువలను సూచించారు.

ఇంటి పరిసరాల్లోనే..

దేశవాళీ కోళ్లకు ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం తొలకరి పలకరించిన తరుణంలో కోళ్ల పెంపకం మంచిది. గడ్డి, పురుగులు, వర్షానికి కొట్టుకుని వచ్చే విత్తనాలు ఈ సీజన్‌లో కోళ్లకు మంచి ఆహారం. పెద్దగా పెట్టుబడి లేని పెరటికోళ్ల పెంపకంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతు మహిళలు, కూలీలు ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ వ్యర్థాలను మేతగా వేస్తే సరిపోతుంది. నాటుకోళ్ల తినడంతో పౌష్టికాహారం కూడా లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆరుబయట తిరుగుతూ పెరగడంతో మాంసంలో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. వీటి మాంసం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. కనీసం పెట్టుబడితో స్వల్ప కాలంలోనే లాభాలు పొందవచ్చు.

జాతి ఎంపిక ముఖ్యం..

కరోనా కాలంలో కోడి మాంసం, గుడ్లు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్న ప్రచారం జరగడంతో ప్రధానంగా నాటు కోడి మాంసం విక్రయాలు పెరిగాయి. స్టెరాయిడ్ ఇంజక్షన్లు, దాణాతో 40 రోజుల్లో మార్కెట్‌కు సిద్ధం చేస్తున్న బ్రాయిలర్ కోడిమాంసం తినడానికి ఇష్టపడని మాంసం ప్రియులు.. నాటుకోళ్లను కొనడానికి పోటీ పడుతున్నారు. మార్కెట్‌లో గిరిరాజా, వనరాజా కోళ్లతోపాటు కలర్ కోళ్లను పెంచుతున్నా.. నాటు కోళ్లను కొనడానికే ఇష్టపడుతున్నారు. అవకాశం ఉన్న ప్రతి రైతు తమ వ్యవసాయక్షేత్రాల్లో నాటుకోళ్లను పెంచుతున్నారు. ఈ కోళ్లను ఎంపిక చేసుకున్నప్పుడు అన్ని రకాల టీకాలు వేయించారో? లేదో? విచారించాలి. ఐదారు వారాల కోడిపిల్లకు అన్ని రకాల టీకాలు వేయిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవు.

పెంపకంలో మెళకువలు

గ్రామీణులు 10 నుంచి 20 కోళ్లను ఒక సమూహంగా ఆరుబయట స్వేచ్ఛగా పెంచుకోవచ్చు. సహజమైన మేత పెడితే సరిపోతుంది. ఆరువారాల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వెదురుకర్రలు, చెక్కలు వంటి స్థానికంగా లభించే వ్యర్థాలతో వీటికి వసతి ఏర్పాటు చేసుకోవచ్చు. 4-8 వారాల్లోపు పిల్లలకు ఒక చదరపు అడుగు, 8-12 వారాల్లోపు వాటికి రెండు చదరపు అడుగుల స్థలం కేటాయిస్తే సరిపోతుంది. కోళ్లు విసర్జించే వ్యర్థాల నుంచి ఏర్పడే తేమను పీల్చుకోవడానికి, చల్లదనం కోసం రంపపు పొట్టును లిట్టర్‌గా వాడుకోవాలి. 5-10 సెంటీమీటర్ల మందంగా పొట్టును పరచి తరచూ సర్దుకోవాలి.

నాణ్యమైన ఆహారం

కోడి పిల్లలకు 28 రోజుల వయస్సు వరకు దాణా అందించడం శ్రేయస్కరం. ఈ దాణా స్థానికంగా లభించే వ్యర్థాలతో తయారు చేసుకుంటే ఖర్చు వ్యయం ఉండదు. ముఖ్యంగా మొక్కజొన్న రవ్వ, పిల్లలు పెరిగే కొద్దీ నీటి తొట్టిలు, మేత తొట్ల సంఖ్య కూడా పెంచుకోవాలి. ఈ రకం కోళ్లకు న్యూకాస్టల్, ఫౌల్‌ఫాక్స్ వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. వీటి నివారణకు 8-9 వారాల పిల్లలకు టీకాలు వేయించాలి. ఈ రకం కోళ్లు 42 రోజుల వయస్సులో 650-750 గ్రాముల వరకు పెరుగుతాయి. పెట్ట కోళ్లను గుడ్ల ఉత్పత్తి కోసం వేరుచేయాలి. 10-20 కోళ్ల గుంపులో ఒకటి నుంచి రెండు పుంజులు ఉండేలా చూసుకోవాలి. ఆరుబయట ఉండడం వలన పరాన్న జీవుల సమస్య వచ్చే అవకాశం ఉన్నందున రెండు, మూడు నెలల మధ్య నట్టల నివారణ మందులు వాడాలి.

ఎన్నికల హామీలకు చట్టబద్ధత కల్పించాలి



దుగ్గుదుర్రు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: ఎన్నికల్లో రాజకీయపార్టీలు ఇచ్చే హామీలు అధికారంలోకి వచ్చాక క్రమం తప్పకుండా అమలు చేసేలా ఎన్నికల కమిషన్ చట్టబద్ధత కల్పించాలని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మంగళవారం దుగ్గుదుర్రు వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో సూర్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన టీడీపీ నేతలు వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలను తూచా తప్పకుండా అమలు చేయడమే కాకుండా ప్రజాసంక్షేమం కోసం ఎన్నికల్లో చెప్పని పథకాలుసైతం అమలు చేశారన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ «బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ» పేరుతో పార్టీ అధ్యక్షుడు జగనన్న ఒక కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈ నెల ఐదో తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ద్రాక్షారామ సాయి మాధవానంద ఫంక్షన్ హాల్ (పేపకాయల బాబ్జి కల్యాణ మండపం)లో పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాషచంద్రబోస్ తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. మండల గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తప్పనిసరిగా హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, ఎంపీపీ మాత భారతి, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మాదిరెడ్డి ప్రుద్వీరాగ్, రేమళ్ళ చిట్టియ్యదొరా, పోతురాజు బాబూరావు, పోలినాటి సూర్యచంద్రం, పోతు శ్రీనివాసు, మాత సూకరావు తదితరులు పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

రామచంద్రపురం రూరల్: ఈనెల 5న రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. ద్రాక్షారామ పైండా వారి సత్రంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు పోలినాటి వరప్రసాద్ అధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు ఏడాదిలోనే విసిగి పోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయనకు తోడుగా పవన్‌కల్యాణ్‌లు ఎన్నికల మేనిఫెస్టోతో ప్రజలను ఏవిధంగా మోసం చేసిందీ ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనే విధంగా సమాయత్తం చేయాలని కోరారు. ఎంపీపీ అంబటి భవాని, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కిన కూటమి నాయకులను నిలదీయాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషం, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), కట్టా సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యుల చేతుల్లోనే ప్రజారోగ్యం



డాక్టర్ మల్లేశ్వరరావును సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు



డాక్టర్ కె.రామును సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజలు ఆరోగ్యం వైద్యుల చేతుల్లోనే ఉందని పలువురు వక్తలు కొనియాడారు. కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండపేట పట్టణంలోని సీనియర్ వైద్యుడు డాక్టర్ అక్కల మల్లేశ్వరలింగంను ఘనంగా సత్కరించారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బళ్లా వెంకటరమణ, మండల కమిటీ ప్రధాన కార్యదర్శి ఇరవాడ రవికుమార్ తదితరులు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడే కృషిలో వైద్యులు నిరంతరం శ్రమిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. జోగా సత్యనారాయణ, సతీష్, మణికంఠ, మండిపూడి చంద్రశేఖర్, పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

మండపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని డా.సూర్యనారాయణ రెడ్డి, డా.జి.సత్యప్రసాద్, డా.కె.రాము, డా.విశ్వనాథ్, డా.జ్యోతిర్మయి, డా.బి.లోకేష్, డా.బి.పావనిలను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి లక్ష్మీ వెంకట నాగేంద్రబాబు, కోశాధికారి సిహెచ్. రాంబాబు మాట్లాడుతూ తీవ్రమైన ఒత్తిడిలో సైతం ఓపికతో రోగులకు సేవలందిస్తున్న వైద్యులు ప్రశంసనీయులన్నారు. క్లబ్ సభ్యులు వాదా ప్రసాదరావు కేవీవీ సత్యనారాయణ, కాళ్ల సూర్య ప్రకాష్ (బాబు), కోనే వీర్రాజు, జీవీ తాతరాజు, వి.వీరభద్రం, పాల్గొన్నారు.

డయేరియాపై రెండు నెలల ప్రచారం

రాయవరం: మాచవరం పీహెచ్‌సీ పరిధిలో డయేరియాపై జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు పీహెచ్‌సీ సిబ్బంది డయేరియా క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు డాక్టర్ మణికంఠ తెలిపారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అతిసారపై అవగాహన కల్పించడం, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, ఎంఎల్‌పీహెచ్‌సీల ద్వారా గృహ సందర్శనలో భాగంగా అతిసార లక్షణాలు ఉన్నవారిని గుర్తిస్తామన్నారు. ఎవరికైనా లక్షణాలు ఉంటే వారికి 14 రోజుల పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ టాబ్లెట్స్ అందిస్తామని తెలిపారు. పిల్లలలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ప్రసాదరావు, హెల్త్ విజిటర్ పి.వైట్‌స్టన్, వీడీసీ ఎం.శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ సీహెచ్.వి.శివ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయ్యేదెప్పుడో?

- ఎంపీడీవో భవన నిర్మాణానికి గ్రహణం
- 2009 నుంచి అసంపూర్తిగా నూతన భవనం
- శిథిలావస్థ భవనంలో విధుల నిర్వహణ



నిర్మాణ పనులకు వేసిన శిలాఫలకం



అసంపూర్తిగా నిలిచిన ఎంపీడీవో భవనం

కపిలేశ్వరపురం: ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం, నిబద్ధత కలగాలంటే ముందు ప్రభుత్వశాఖలకు సంబంధించిన కార్యాలయ భవనాలు పటిష్ఠంగా ఉండాలి. అవి ఎంత పటిష్ఠంగా నిర్మించి కార్యకలాపాలు నిర్వహిస్తే అప్పుడు చట్టాలు, ప్రభుత్వంపై ఓ నమ్మకం ఏర్పడుతుంది. మండలంలోని 19 గ్రామాల ప్రభుత్వ శాఖలన్నింటికీ కేంద్ర బిందువుగా మండల పరిషత్ కార్యాలయం అనుసంధానమై పనిచేస్తుంది. మండల స్థాయి అధికారులు తమ విధులను నిర్వహించేందుకు అవసరమైన ప్రధాన కార్యాలయం. ప్రభుత్వ పథకాలు ద్వారా ప్రజలకు అందజేసే సామాగ్రిని, ఎన్నికల సామాగ్రిని ఎంపీడీవో కార్యాలయంలోనే భద్రపరుస్తారు. ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న కార్యాలయం దీర్ఘకాలంగా శిథిలావస్థితిలో కొనసాగుతుంది. 2009లో ప్రారంభించిన నూతన భవనం అసంపూర్తిగా మిగిలింది. సొంత కార్యాలయ పనులే పూర్తి చేయించుకులేని అధికారులు ఇంకా ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని పలువురు ప్రతినిధులు చర్చించుకుంటున్నారు.

ప్రతిపాదన చేసి ఏళ్లు గడుస్తున్నా..

కపిలేశ్వరపురం మండల పరిషత్ నూతన కార్యాలయ భవనం మొండిగోడలతో మిగిలింది. భవన నిర్మాణానికి ప్రాథమికంగా 2009 ఫిబ్రవరిలో రూ.55 లక్షలు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి భవన నిర్మాణానికి భూమి పూజ సైతం చేశారు. ఆ నిధులతో నిర్మాణ పనులు చేపట్టగా స్లాబు ఎత్తు వరకూ నిర్మాణం జరిగింది. కేటాయించిన నిధులు ఏ మాత్రం సరిపోక పోవడంతో భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచి పోయింది. అనంతరం మండల పరిషత్ తరపున ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించడంతో జిల్లా పరిషత్ అధికారులు పలుమార్లు రావడం నివేదికలు తయారు చేసుకుని వెళ్లడం తప్పితే నిధులు మాత్రం విడుదల కాలేదు.

ఆదాయం ఫుల్.. నిధులు నిల్

2009 కాలంలో జిల్లా పరిషత్‌కు కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామాల్లో ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక సీనరేజి నిధులు సమకూరేవి. వాటితో కోట్లాది రూపాయిల సీనరేజి నిధులు అటు జిల్లా పరిషత్‌కు, ఇటు మండల పరిషత్, ర్యాంపులు ఉన్న గ్రామాలకు సమకూరడంతో మండల పరిషత్ కార్యాలయ నూతన భవనానికి జిల్లా పరిషత్ నుంచి నిధులు కేటాయించాలంటూ అప్పటి ప్రజాప్రతినిధులు అనేక మార్లు విజ్ఞప్తులు పంపారు. మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి ఉమ్మడి రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నప్పటికీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో అప్పట్లో భవన నిర్మాణం అసంపూర్ణంగా నిలిచిపోయింది.

శిథిల భవనంలోనే విధులు

ప్రస్తుతం మండల పరిషత్ కార్యకలాపాలన్నీ శిథిలావస్థకు చేరిన భవనంలోనే నిర్వహిస్తున్నారు. పలు శాఖల విభాగాలకు ప్రత్యేక గదులు అవసరం ఉండటంతో కార్యాలయ రికార్డులు, సామాగ్రిలను భద్రపర్చుకునేందుకు గదుల లభ్యత లేక, ఉపాధి పనులకు వినియోగించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు చెందిన తదితర పనిముట్లను వరండాలోనే ఉంచాల్సి వస్తుంది. పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖలకు ఒక్కో గదిని మాత్రమే కేటాయించారు. ఆయా శాఖల సామాగ్రి, రికార్డులను భద్రపర్చుకోవడం సమస్యగానే మారిందని ఉద్యోగులు తెలిపారు. శాఖల సిబ్బంది అవసరాలు తీరేందుకు విశాల భవనం అవసరం ఎంతైనా ఉంది. తగిన నిధులను సమకూర్చి భవన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తాత్కాలికంగా దీక్ష విరమణ



కేశవరం నిరసన దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్‌తో 75 రోజులుగా రిలే నిరసన దీక్ష చేస్తున్న వల్లూరి శ్రీవాణి మంగళవారం తాత్కాలికంగా తన రిలే నిరసన దీక్షను విరమించారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు సిద్ధూ, రవికుమార్, జోసఫ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి ప్రభుత్వం మొద్దు నిద్ర వహిస్తున్న నేపథ్యంలో డిమాండ్ల సాధనకు మరింత ఉధృతంగా ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యం దెబ్బతింటున్న నేపథ్యంలో తాత్కాలికంగా నిరశన దీక్షను విరమించాలని కోరగా ఆమె అంగీకరించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాల సమస్యలపై విద్యార్థి సంఘాలు భవిష్యత్తులో ఆందోళనకు సిద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో వెంకట్, సాయిరాం, సుహాస్, కె.సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బొండు మట్టి తరలిస్తున్న మూడు లారీల సీజ్



అక్రమంగా బొండు మట్టిని తరలిస్తున్న లారీలను సీజ్ చేసిన రెవెన్యూ సిబ్బంది

కె.గంగవరం: మండలంలోని మసకపల్లి గ్రామ పరిధిలోని గౌతమి గోదావరి నది ఒడ్డున అక్రమంగా బొండు మట్టి (గొండ్రుమట్టి)ని తరలిస్తున్న మూడు లారీలను రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల సీజ్ చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మసకపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని సర్వే నెంబర్ 8లో ఏటిగట్టు నుంచి అక్రమంగా అనుమతులు లేకుండా గొండ్రుమట్టిని తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ఏటిగట్టుపై తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీలో మసకపల్లి పరిధిలో ఏటిగట్టుపై నుంచి వస్తున్న అక్రమ బొండు మట్టిలారీలను సీజ్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన లారీలను భూగర్భ గనుల శాఖ అధికారులకు అప్పగించామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరామ్, రెవెన్యూ తనిఖీదారు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన వైద్య సిబ్బందికి సత్కారం




బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న వైద్యులు విష్ణువర్ధన్, హర్షిత తదితరులు

కె.గంగవరం: మండలంలోని పామర్రు పీహెచ్‌సీలోని కొంత కాలంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సిబ్బందిని పీహెచ్‌సీ వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఘనంగా సత్కరించారు. పామర్రు పీహెచ్‌సీలో విధులు నిర్వహించిన సూపర్‌వైజర్ సుబ్బారావు, స్టాఫ్‌నర్స్ ఎలిజబెత్‌తో పాటు పలురువు వైద్య సిబ్బంది బదిలీల నేపథ్యంలో జిల్లాలోని పలు వైద్యాసుపత్రులకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బదిలీపై వెళ్తున్న సిబ్బందిని పీహెచ్‌సీ వైద్యులు, ఆసుపత్రి పీహెచ్ఎన్ తదితరులు శాలువాలు, పూలదండలు, బహుమతులతో సన్మానించారు. అనంతరం వైద్యుల దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు విష్ణువర్ధన్, హర్షితలను వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు.

బీజేపీ అధ్యక్షుడిని కలసిన నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): బీజేపీ పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పి.వంశీ నాగేంద్ర మాధవ్‌ను మంగళవారం విజయవాడలో మండపేట నియోజకవర్గ నేతలు కలిశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్ష బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో నియోజకవర్గ ఇన్‌చార్జి కోటిపల్లి వీవీ సాయిరాం, జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, పార్టీ అనుబంధ రాష్ట్ర కిసాన్ మోర్చ జోనల్ ఇంచార్జ్ చేకూరి రమేష్ వర్మ, రాష్ట్ర కిసాన్ కార్యవర్గ సభ్యులు వల్లభనేని రవీంద్ర బాబు, నియోజకవర్గ కో కన్వీనర్ కె.మురళీకృష్ణ, పట్టణ పూర్వ అధ్యక్షుడు ఎం.సుబ్బారావు ఉన్నారు.

ఆడియో సిస్టమ్ బహూకరణ



హెచ్‌ఎంకు సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న విద్యార్థులు

రాయవరం: మండలంలోని వెదురుపాక పడాల పెద రామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఆడియో సిస్టమ్‌ను హెచ్‌ఎం రాంబాబుకు అందజేశారు. 2000 నుంచి 2005 వరకు ఆరు నుంచి పది వరకు పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.11 వేల విలువైన చార్జింగ్‌తో పనిచేసే మైకు, లౌడ్ స్పీకరు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జి.విజయభాస్కరరెడ్డి, వి.సత్తిబాబు, పి.శివమణికంఠరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.